ప్రజాశక్తి
సోమవారం 23 డిసెంబర్ 2024
8 పేజీలు
ఎన్‌టిఆర్
కృష్ణా

దుర్గమ్మ దర్శనానికి క్యూలైన్లో వస్తున్న భవానీలు

దుర్గగుడికి తరలివచ్చిన భవానీలు

రెండో రోజు దీక్ష విరమణకు లక్ష మంది రాక

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో భవానీ దీక్షా విరమణలు రెండో రోజు ఆదివారం ఉదయం మూడు గంటల నుండి వేలాది మంది భవానీలు గిరి ప్రదక్షిణకు తరలివచ్చారు. సుమారు లక్ష మంది వరకూ దుర్గమ్మను దర్శించుకున్నట్లు ఆలయ ఇఒ రామారావు తెలిపారు. దర్శనం చేసుకొని మాల విరమణ చేశారు. తదుపరి హోమగుండాల వద్ద నేతి కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు సమర్పించారు. యాగశాలలో శత చండీ యాగం జరుగుతోంది. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత...జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు, డీసీపీ గౌతమి శాలి తదితరులతో కలిసి మోడల్ గెస్ట్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం (ఐసీసీసీ) నుంచి కార్యకలాపాలను పర్యవేక్షించారు. తొలిరోజు (మిగతా 2లో)

తెలంగాణా మంత్రి సీతక్కకు దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

ప్రమాదంలో ప్రజారోగ్యం

- కుటుంబ ఆరోగ్య సర్వేలో బహిర్గతం
- జిల్లాలో మొత్తం కుటుంబాలు 6.08 లక్షలు
- సర్వే పూర్తయిన కుటుంబాలు 79,910
- రక్తపోటు బాధితులు 35,273 మంది
- షుగర్ వ్యాధి పీడితులు 28,082 మంది
- కేన్సర్ రోగులు 241 మంది
- కేన్సర్ లక్షణాలున్న వారు 1,810 మంది

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ప్రజారోగ్యం ప్రమాదకరంగా మారుతోంది. ఆరోగ్య కుటుంబ సర్వేలో వెల్లడవుతున్న వ్యాధుల తీవ్రత ఆందోళన కలిగిస్తోంది. రక్తపోటు, షుగర్ వ్యాధిలతోపాటు వివిధ రకాల కేన్సర్ లక్షణాలతో బాధపడుతున్న వారు ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు సర్వేలో బహిర్గతమవుతోంది. నవంబర్ 14వ తేదీ నుంచి జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా నాన్ కమ్యూనికల్ డిసీజెస్ (ఎన్సీడీ 3.0) సర్వేను కృష్ణా జిల్లాలో నిర్వహిస్తున్నారు. రూరల్ ప్రాంతంలో 4,90,449 కుటుంబాలను, అర్బన్ ప్రాంతంలోని 1,18,218 కుటుంబాల సర్వేను 2025 ఆగస్టు నాటికి పూర్తి చేయాలి. రూరల్ ప్రాంతంలో 355, అర్బన్‌లో 110 బృందాల చొప్పున మొత్తం 508 బృందాలు ఈ సర్వే నిర్వహిస్తున్నాయి. ఎఎన్ఎం, ఆశ వర్కర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఒక బృందంగా సర్వే నిర్వహిస్తున్నారు. ఒక్కో బృందం రోజుకు సగటున ఐదు కుటుంబాలను సర్వే నిర్వహిస్తోంది. సర్వేలో భాగంగా ఒక్కో కుటుంబం నుంచి 120 ప్రశ్నలకు సంబంధించి వివరాలు సేకరిస్తున్నారు. వివరాలను ఎప్పటికప్పుడు ఎన్సీడీ యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. యాప్‌లో వివరాలు నమోదయిన వెంటనే సంబంధిత ఇంటి యజమాని ఫోన్ నంబర్‌కు ఓటిపి వస్తుంది. ఓటిపి రాని పక్షంలో యజమాని వేలిముద్ర (థంబ్) వేయాల్సి వస్తోంది.

జిల్లా వ్యాప్తంగా బృందాలు 37 రోజుల్లో రూరల్ ప్రాంతంలో 64,118 కుటుంబాలను సర్వే చేశారు. అర్బన్‌లో 15,792 కుటుంబాలను సర్వే చేశారు. మొత్తం 79,910 కుటుంబాల్లో అత్యధికులు బిపి, షుగర్ వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించారు. 35,273 మందికి రక్తపోటు (బిపి), 28,082 మందికి మధుమేహం (షుగర్) ఉన్నట్లు గుర్తించారు. 53 మంది కుష్టు, 49 మంది నోటి కేన్సర్, 101 మంది రొమ్ము కేన్సర్, 91 మంది గర్భాశయ ముఖద్వార కేన్సర్‌కు చికిత్స చేయించుకుంటున్నారు. మరో 580 మందిలో నోటి కేన్సర్, 660 మందిలో రొమ్ము కేన్సర్, 570 మందిలో గర్భాశక ముఖద్వార కేన్సర్ లక్షణాలను గుర్తించారు. కేన్సర్ లక్షణాలున్న వారికి బయాప్సీ, స్కానింగ్ పరీక్షలు నిర్వహించడానికి మచిలీపట్నం సర్వజనాసుపత్రికి సిఫార్సు చేశారు.

వ్యాధులకు చికిత్స కీలకం

వ్యాధుల చికిత్సకు ఎక్కువ మంది ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. చికిత్సకు, మందుల కొనుగోలుకు ఆయా కుటుంబాలు నెల నెలా వేలకు వేలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. కేన్సర్ వ్యాధికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన చికిత్స అందక ప్రయివేటు వైద్యానికి లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. కుటుంబాల ఆర్థిక పరిస్థితులు తలకిందులవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సర్వేతో సరిపెట్టకుండా కుటుంబాల్లో వ్యాధి పీడితులకు చికిత్స అందించడానికి ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తే మేలు జరుగుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

3.26 లక్షల టన్నుల ధాన్యం సేకరణ

- రైతులకు రూ..733 కోట్లు జమ
- ప్రజాశక్తితో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పద్మాదేవి

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ధాన్యం సేకరణ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ సిహెచ్.పద్మాదేవి చెప్పారు. రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కె) ద్వారా ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో 24 గంటల్లో నగదు జమవుతోందని తెలిపారు. ఆర్ఎస్‌కెల్లో నిర్ధారించిన తేమ శాతాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ అంశంలో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ధాన్యం అమ్మకాల్లో ఎటువంటి సమస్యలు ఎదురైనా పౌరసరఫరాల సంస్థ టోల్‌ఫ్రీ, కంట్రోల్ రూమ్‌లకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పద్మాదేవి ధాన్యం విక్రయాలపై పలు అంశాలను వివరించారు.

ప్రశ్న : ఈ సీజన్లో ధాన్యం సేకరణ ఎలా జరుగుతోంది?

జిల్లాలో 159 రైస్ మిల్లులున్నాయి. రైతులు తమకు అందుబాటులో ఉన్న రైస్ మిల్లుకు ధాన్యం సరఫరా చేసుకునే వెసులు బాటును ప్రభుత్వం కల్పించింది. గత ఏడాదితో పోలిస్తే ఈ సీజన్లో యంత్రాలతో నూర్పిడి పెరిగింది. 302 ఆర్ఎస్‌కెల ద్వారా రోజుకు సగటున 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తున్నాం. 36,450 మంది రైతుల నుంచి 3 లక్షల 26 వేల 599 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. ఆర్ఎస్‌కెల్లో ధాన్యం విక్రయించిన 24 గంటలలోపే (మిగతా 2లో)

సీనియర్లను సత్కరిస్తున్న నాయకులు సిహెచ్.బాబురావు, డి.వి.కృష్ణ, డి.కాశీనాథ్, కె.శ్రీదేవి తదితరులు; విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న పార్టీ శ్రేణులు

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం

- సిపిఎం రాష్ట్ర నాయకులు బాబూరావు పిలుపు
- విద్యుత్ బిల్లులు దహనం
- సెంట్రల్ సిటీ కార్యదర్శిగా మళ్లీ బి.రమణరావు ఎన్నిక

నూతన కార్యదర్శి బి.రమణరావు

ప్రజాశక్తి - విజయవాడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, కార్పొరేట్, మతోన్మాద విధానాలు, భారాలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పిలుపునిచ్చారు. సిపిఎం విజయవాడ సెంట్రల్ సిటీ 23వ మహాసభ ఆర్.కోటేశ్వరరావు, ఎం.డేవిడ్ నగర్ (అజిత్‌సింగ్‌నగర్ రాయల్ బాంక్వ్యాట్‌హాల్)లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పైపుల రోడ్డులో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభ జరిగింది. మహాసభ ప్రారంభసూచికగా పైపుల రోడ్డు సెంటర్లో పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు వెల్లంకి కృష్ణమోహన్ ఆవిష్కరించారు. అనంతరం మృతవీరుల స్థూపం వద్ద నేతలు నివాళు లర్పించారు. విద్యుత్ భారాలను నిరసిస్తూ కార్యకర్తలు బిల్లులను దహనం చేశారు. ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలను ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని నినదించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో బాబూరావు మాట్లాడుతూ బుడమేరు వరద బాధితులకు సాయం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వరద బాధితులకు సిపిఎం, ప్రజా సంఘాలు వెన్నుదన్నుగా నిలిచాయని గుర్తుచేశారు. 15 రోజులపాటు లక్షా 85 వేల మంది ప్రజలకు భోజనాలు ఏర్పాటు చేసి, వరదల్లో చిక్కుకున్న వారిని తమ పార్టీ శ్రేణులు కాపాడాయని గుర్తుచేశారు. వరద సాయం కోసం నేటికీ పోరాడుతూనే ఉందన్నారు. సింగ్‌నగర్, (మిగతా 2లో)

సావనీర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ : "సామ్రాజ్యవాదుల కబంధహస్తాల నుండి వ్యవసాయ రంగాన్ని పరీరక్షించుకుందాం' అనే నినాదంతో ముద్రించిన రైతుకూలీ సంఘం (ఆ.ప్ర.) రాష్ట్ర మహాసభ సావనీర్ ఆవిష్కరణ ఆదివారం జరిగింది. ఉమ్మడి కష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన ఈ కారక్రమంలో సంఘం రా ఉపాధ్యక్షులు వీరబాబు, జనసాహితీ రాష్ట్ర అధ్యక్షులు దివికుమార్, ఓపిడీఆర్ రాష్ట్ర కార్యదర్శి వి.హనుమంతరావు, పిఒఎల్ నాయకులు రాష్ట్ర అధ్యక్షులు డా.సి.విజయ, జె.జగన్ ప్రసంగించారు.

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన

కెవిపిఎస్, బిఎస్‌పి, దళిత, ప్రజాసంఘాల ప్రదర్శన, ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై పార్లమెంట్లో కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ విజయవాడ మాచవరంలో కెవిపిఎస్, బీఎస్పీ కూలీ, అంబేద్కర్ ట్యూషన్ పాయింట్ విద్యార్థులు, దళిత అభ్యుదయ సంక్షేమ సంఘం, అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి ధర్నా చేశారు. అమీషాను మంత్రి పదవి నుండి తొలగించాలని, దేశ ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈప్రదర్శన మాచవరం యారంవారి వీధిలోని అంబేద్కర్ కమ్యూనిటీ కళ్యాణ మండపం వద్ద నుంచి ప్రారంభమైంది. దళిత సంఘాలు, స్థానిక ప్రజలు, పెద్దలు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు జి.నటరాజు మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానించిన అమిషాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంపై ఆయనకు గౌరవం లేకుండా పోయిందన్నారు. ఈకార్యక్రమంలో బీఎస్పీ నాయుకులు కనపర్తి మురళి, కె.వి.కోటేశ్వరరావు, జి వి ప్రసాద్, కొసనం కోటేశ్వరావు, జి అమతరావు, చందా జాన్‌బాబు, వై.వెంకటేశ్వరరావు, అమర్లపూడి దాసు, గోవాడ మనోహార్, కనపర్తి కోటేశ్వరరావు, ఆర్ రవి తదితరులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనలో ప్రజా సంఘాల నేతలు, కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు జి.నటరాజు

ప్రజాగొంతుక పిడిఎఫ్

●ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు ●కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో గెలిపించాలని పిలుపు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకులతోపాటు అన్ని వర్గాల ప్రజల సమస్యలపై ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ఎంఎల్‌సిలు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నారని ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఈ నేపథ్యంలో మార్చిలో జరిగే కృష్ణా -గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట ఎన్‌జిఒ కాలనీ ట్రైనీ టాట్స్ కిండర్ జాయ్ స్కూల్‌లో ఆదివారం కృష్ణా -గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావుకు మద్దతుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎన్నికల కార్యచరణ సమావేశం జరిగింది. యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడుతూ స్వార్థ ప్రయోజనాలకు తావులేకుండా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రధాన రాజకీయ పార్టీలు ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో పిడిఎఫ్ విజయానికి విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కష్ణయ్య మాట్లాడుతూ పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించాలని పిలుపునిచ్చారు.

యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి.ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు, పీడిత ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుక లక్ష్మణరావు లాంటి వ్యక్తులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కెఎస్‌కు గెలుపుకు కృషి చేయాలని కోరారు. అనంతరం వివిధ ప్రజా, కార్మిక, ఉపాధ్యాయ సంఘాల నేతలు మాట్లాడారు. అనంతరం కెఎస్ గెలుపునకు కృషి చేసేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలతో ఎన్నికల కార్యచరణ కమిటీని ఏర్పాటు చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

CHANGE OF NAME

I, AZHARUDDIN S/o. AMEER HAMZA DAMDA ABU (old name) Door.No.39-11-A/1, GF-2, Magantivari Street, Sri Sairam Towers, Machavaram, Vijayawada , NTR District, Andhra Pradesh My Name has been changed to **AZHARUDDIN DAMDA ABU W/o. S/o. AMEER HAMZA DAMDA ABU (New name)**. Hereafter my name is known as **AZHARUDDIN DAMDA ABU W/o. S/o. AMEER HAMZA DAMDA ABU.**

CHANGE OF NAME

I, SAYEEDA, W/o. AMEER HAMZA DAMDA ABU (old name) Door.No.1119, Gulfaam, Umer Street, 1st Cross, Madina Colony, Bhatkal, Uttara Kannada District, Karnataka-581320 My Name has been changed to **SAYEEDA BANU SHABANDRI W/o. AMEER HAMZA DAMDA ABU (New name)**. Hereafter my name is known as **SAYEEDA BANU SHABANDRI W/o. AMEER HAMZA DAMDA ABU .**

CHANGE OF NAME

I, SHAHANA W/o. AZHARUDDIN DAMDA ABU (old name) Door.No.39-11-A/1, GF-2, Magantivari Street, Sri Sairam Towers, Machavaram, Vijayawada , NTR District, Andhra Pradesh My Name has been changed to **SHAHANA ARMAR W/o. AZHARUDDIN DAMDA ABU (New name)**. Hereafter my name is known as **SHAHANA ARMAR W/o. AZHARUDDIN DAMDA ABU.**

CHANGE OF NAME

I, CHINNAM SREE BABU (old name) Door.No.15-6, Flat No.SF-1, Kosaraju Residency, Main Road, Yanamalakuduru, Penamaluru Mandal, Krishna District, Andhra Pradesh My Name has been changed to **CHENNAM SREE BABU (New name)**. Hereafter my name is known as **CHENNAM SREE BABU.**

మొదటిపేజీ తరువాయి

3.26 లక్షల టన్నుల ధాన్యం సేకరణ

రైతుల ఖాతాల్లో నగదు జమవుతోంది. ఇప్పటి వరకు రూ.733 కోట్లు జమయింది.

ప్రశ్న : రైతులకు కనీస మద్దతు ధర అందుతోందా?

ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2320, కామన్ రకానికి రూ.2300 ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) నిర్ణయించింది. రైతులు దళారులకు తక్కువ ధరకు ధాన్యం విక్రయించి నష్టపోవాల్సిన అవసరం లేదు. ఆర్‌ఎస్‌కెల ద్వారా ధాన్యం అమ్ముకునే రైతులకు ప్రభుత్వం కనీస మద్దతు ధర అందిస్తోంది.

ప్రశ్న : ధాన్యంలో తేమశాతం, ఇతర సమస్యలు ఎలా పరిష్కరిస్తున్నారు?

17 శాతం తేమ ఉన్న ధాన్యానికి కనీస మద్దతు ధర నిర్ణయించాం. సాధారణ వాతావరణ పరిస్థితుల్లో పచ్చిధాన్యంలో నిర్ధారించిన ప్రమాణాల మేరకు తేమ ఆరబెట్టుకుని తీసుకురావడం ద్వారా రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన పూర్తి స్థాయి ధర అందుతుంది. ఆర్‌ఎస్‌కెల్లో నిర్ధారించిన తేమ శాతాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటున్నాం. వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని కొన్ని సందర్భాల్లో తేమ శాతంలోనూ ప్రభుత్వం సడలింపు ఇస్తోంది. ఆయా సందర్భాల్లో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా తేమశాతం ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని కూడా సేకరిస్తున్నాం.

ప్రశ్న : అక్రమార్కులపై చర్యలు తీసుకుంటున్నారా?

రైస్ మిల్లర్లు, కస్టోడియన్ ఆఫీసర్లు ఎవరైనా రైతులను మోసం చేయాలని చూస్తే అంగీకరించం. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తున్నాం. పామర్రు ప్రాంతంలోని ఒక రైస్ మిల్లును ఈ ఏడాది సేకరణకు దూరంగా పెట్టాం. ఒక కస్టోడియన్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేశాం. మరో కస్టోడియన్ ఆఫీసర్‌కు నోటీసులు ఇచ్చాం.

ప్రశ్న : సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తున్నారా?

ధాన్యం విక్రయాల్లో రైతులకు సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1967కు ఫోన్ చేయవచ్చు. జిల్లాలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశాం. సెల్ నంబర్ 8247693551కు ఫోన్లో తెలియజేయవచ్చు. టెక్నికల్ టీంలు వెంటనే స్పందిస్తాయి. రైతుల సమస్యలను ఈ టీం పరిష్కరిస్తుంది.

దుర్గగుడికి తరలివచ్చిన భవానీలు

రాత్రి 11 గంటల సమయానికి చైల్డ్ మానిటరింగ్ సిస్టమ్ (సీఎంఎస్)పై మొత్తం 1,960 మంది చిన్నారులకు క్యూఆర్ కోడ్ ట్యాగ్‌లు వేశారు. పారిశుధ్యం, తాగునీరు తదితర ఏర్పాట్లను విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డిఓ కావూరి చైతన్య, ఆలయ ఈవో కేఎస్ రామరావు తదితరులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, తెలంగాణ మంత్రి సీతక్క తదితరులు దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 200 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు.

ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న వెల్లంకి కృష్ణమోహన్

కండ్రిక ప్రాంతాల్లోని వేలాది పేద కుటుంబాలకు తమ పార్టీ నేతృత్వంలోనే ఎటువంటి ఖర్చు లేకుండానే పట్టాలిప్పించామన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై పార్లమెంట్లో హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం మోపుతున్న విద్యుత్ భారాలపై ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కష్టజీవులు, పేదల గొంతుకైన సిపిఎం బలోపేతానికి పార్టీ శ్రేణులు స్థానిక సమస్యలను అధ్యయనం చేస్తూ, వాటి పరిష్కారానికి ప్రజలను భాగస్వాములను చేస్తూ వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించాలన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాధ్, కె.శ్రీదేవి మాట్లాడుతూ ప్రజాపునాది పటిష్టతకు, ఉద్యమ విస్తరణకు కృషి చేయాలన్నారు. ప్రతినిధుల సభకు నాయకులు కె.దుర్గారావు, ఎం.సీతారాములు, కె.సరోజ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఇటీవల కాలంలో మృతి చెందిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, నగర నాయకులు ఆర్.కోటేశ్వరరావు, ఎం.డేవిడ్, ప్రసన్న, జ్యోత్స్న, బుడమేరు వదరలు, ఇతర ప్రమాదాల్లో మృతి చెందిన వారికి పార్టీ నాయకులు ఝాన్సీ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. సీతారామ్ ఏచూరి చిత్రపటానికి బాబూరావు తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహాసభ నివేదికను కార్యదర్శి భూపతి రమణారావు ప్రవేశపెట్టారు. అనంతరం ప్రతినిధులు నివేదికపై చర్చించారు. మహాసభలో పార్టీ విజయవాడ పశ్చిమ, తూర్పు సిటీల కార్యదర్శులు బోయి సత్యబాబు, పి.కృష్ణ పాల్గొన్నారు. పిఎన్‌ఎం జిల్లా కార్యదర్శి పి అప్పన్న నేతృత్వంలో కళాకారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కళారూపాలు ఆకట్టుకున్నాయి.

సీనియర్ నేతలకు, కార్యకర్తలకు సత్కారం

పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్, మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ వెల్లంకి కృష్ణమోహన్‌తోపాటు సీనియర్ కార్యకర్తలను మహాసభలో సత్కరించారు. పిల్లి వెంకటేశ్వరరావు, పొనుగోటి వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి, అమ్మాజి, ఎం.రమణమ్మ, సన్యాసిరావు, సుందరరామరాజు, కొల్లి రత్నం, టి విజయలక్ష్మీ, పబ్బతి ప్రసాద్, ఇమామ్, వెంకట నర్సమ్మ, పరుసురామయ్య తదితరులను పార్టీ నేతలు శాలువా, పూలమాలలతో సత్కరించారు.

నూతన కార్యదర్శిగా మళ్లీ బి.రమణరావు ఎన్నిక

20 మందితో నూతన కమిటీ

నూతన కార్యదర్శిగా తిరిగి భూపతి రమణరావును మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. 20 మందితో నూతన కమిటీ ఎన్నికైంది. కార్యదర్శివర్గ సభ్యులుగా కె.దుర్గారావు, టి.ప్రవీణ్, ఎం.శీతారాములు, కె.సరోజ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా చింతల శ్రీను, వై.సుబ్బారావు, ఎస్‌కె పీరు సాహెబ్, జి.ఝాన్సీరాణి, ఎస్.రమేష్, వి.శ్రీనివాసరావు, ఎస్‌కె షకీల, పి.వెంకటరెడ్డి, ఎస్‌కె నిజాముద్దీన్, యు.శివలింగేశ్వరరావు, ఎం.బాబూరావు, డి.స్టీఫెన్‌బాబు, యు.కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సింగ్‌నగర్ రెండో ఫ్లైవోవర్ నిర్మించాలి

మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది. సింగ్‌నగర్ రెండో ఫ్లైఓవర్ నిర్మించాలని, విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ మహాసభ తీర్మానించింది. ఆర్‌ఆర్‌పేట, వాంబేకాలనీ ప్రాంతాల్లోని ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేసి పట్టాలివ్వాలని, గుణదల ఫ్లైఓవర్ నిర్మించాలని, ఎక్సెల్ ప్లాంట్‌ను దూరంగా తరలించాలని కోరుతూ తీర్మానించింది. మహిళల సమస్యలు పరిష్కరించాలని, ఇళ్లు లేని వారికి ఇళ్లు, స్థలాలు మంజూరు చేయాలని, వాంబేకాలనీవాసుల ఉపయోగార్థం ఆర్‌యుబి నిర్మించాలని కోరింది.

IN THE COURT OF THE VI ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT VIJAYAWADA
I.A. 91/2021 IN O.S. 47/2020

Between :
Chopparapu Lakshmi Tarabai
..... Petitioner/ Respondent 6
AND
Dara Venkateswara Vara Prasad & others
.... Respondents

Respondent 6 :-
Jujjavaru Sampath Kumar, S/o Ramesh Babu, R/o 3-235, Harijanawada, Gosala, Vanukuru, Krishna Dist.

పై నెంబరు గల పిటీషన్‌లోని పిటీషనరు/ డిఫెండెంట్ నెం.6 వారు పై నెంబరు గల దావా చెల్లదని సదరు దావాను తిరస్కరించమని శ్రీ కోర్టువారి ఎదుట పిటీషను నెం. 91/2021 దాఖలు పరిచినారు. సదరు పిటీషన్‌లోని రెస్పాండెంటు నెం.6 / డిఫెండెంట్ నెం.5 అయిన Jujjavaru Sampath Kumar, S/o Ramesh Babu, R/o 3-235, Harijanawada, Gosala, Vanukuru, Krishna Dist. వారు శ్రీ కోర్టువారి నోటీసులు తీసుకొనకుండా జాప్యం చేయుచున్నారు. సదరు రెస్పాండెంటు నెం.6 వారి హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది.02-01-2025వ తేదీన వాయిదా వేసినారు. కావున రెస్పాండెంటు నెం.6 వారు తేదీ 02-01-2025వ తేదీన ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల సదరు రెస్పాండెంటు నెం.6 పరోక్షమున తీర్మానించెదరు.

(బై ఆర్డర్)

ఇట్లు
ఆర్.వి.రామకృష్ణ,
జె.దిలీప్‌కుమార్,
అడ్వకేట్స్,
కస్పావారివీధి, గవర్నర్‌పేట.
విజయవాడ-02.
సెల్ : 94401 75910

ఐవిఎం సేవలు స్ఫూర్తిదాయకం

చిన్నారులకు దుస్తులు అందజేసిన దృశ్యం

ప్రజాశక్తి-చల్లపల్లి : క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దోహదం చేస్తున్నాయని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని పురిటిగడ్డ ఐవీఎం కార్యాలయంలో ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మనిషిలోని మగత్వాన్ని పారద్రోలి మానవత్వాన్ని మేల్కొలిపిన మహనీయుడు ఏసుక్రీస్తు అన్నారు. క్రీస్తు బోధనల ఫలితంగానే ప్రపంచం శాంతి సహనంతో జీవిస్తోందన్నారు. అణు యుద్ధపు అంచుల్లో ఉన్న ప్రపంచాన్ని క్రీస్తు బోధనలే కాపాడుతున్నాయన్నారు. ఏసుక్రీస్తు బోధించిన సహాయ గుణాన్ని అందిపుచ్చుకుని ఇండియా విలేజ్ మినిస్ట్రీ నిర్మాత డాక్టర్ వేములపల్లి సురేష్ - రోజా దంపతులు దశాబ్దాలుగా ఎంతోమంది పేద విద్యార్థులను ఉన్నత విద్యావం తులుగా తీర్చిదిద్దారని తెలిపారు. విపత్తులు సంభవించినపుడు ఐవిఎం సేవలు ఆదర్శనీయమన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ ఏసు క్రీస్తు బోధించిన క్షమాగుణం ఎంతో మహెూన్నతం అన్నారు. ఈ సందర్భంగా అతిధుల చేతులమీదుగా 12 మంది పేద విద్యార్థులకు రూ.3లక్షల అరవై వేలు ఐవీఎం స్కాలర్ షిప్ అందచేశారు. రూ.ఇరవై వేల వ్యయంతో చల్లపల్లి మండలం పాగోలు శివారు మేకావారిపాలెంకు చెందిన కేసాని నాగమల్లేశ్వరరావుకు వీల్ ఛైర్, పాగోలుకు చెందిన పైడిపాముల వెంకయ్యకు ట్రై సైకిల్ అందచేశారు. 110 మంది ఐవీఎం విద్యార్థులకు క్రిస్మస్ బహుమతులు అందచేశారు వద్ధులు, వితంతువులు, వికలాంగులకు నూతన వస్త్రాలు అందచేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, షేక్ నబీఘోరీ, విశ్రాంత డీఎస్పీ కే.హరి రాజేంద్రబాబు, సంస్థ ప్రతినిధులు వేములపల్లి విజయ, సోఫీ, జీ.ప్రసాద్, ఎన్.ఫణి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి -నాగాయలంక : మండలం సొర్లగొంది గ్రామంలో వనమాల సావిత్రి అనే మహిళ శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుని చనిపోయినట్లు నాగాయలంక ఎస్.ఐ కె.రాజేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిల్లలు పుట్టలేదని భర్త, అత్త, బావలు వేధించడం వల్లే తమ కుమార్తె ఉరివేసుకున్నట్లు మృతురాలి తల్లిదండ్రులు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. మతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం అవనిగడ్డ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ధాన్యం పరిశీలిస్తున్న ఎంఎల్ఎ బుద్ధప్రసాద్

వరి ధాన్యం పరిశీలన

ప్రజాశక్తి-చల్లపల్లి : కూటమి ప్రభుత్వం రైతులకు సంపూర్ణమైన మేలు చేస్తోందని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం నడకుదురులో రైతుల వరి ధాన్యం పంటను ఆయన పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరకు మాత్రమే ధాన్యం విక్రయించాలని, రైతుసేవా కేంద్రంలో తేమ శాతమే ఫైనల్ అని తెలిపారు. మిల్లర్లు అధిక తేమ శాతం చూపిస్తే అధికారుల దష్టికి తీసుకు రావాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు ధాన్యం విక్రయించిన రెండు రోజుల్లోనే సొమ్ము చెల్లిస్తోందని తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మోపిదేవి : అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి విశ్రాంత ఉపాధ్యాయులు అడపా గురవయ్య తన వంతు సాయం అందించి మరోమారు తన ఉదార స్వభావాన్ని చాటు కున్నారు. మోపిదేవి మండలంలోని కోసూరువారిపాలెం బీసీ కాలనీకి చెందిన దేవనబోయిన కోటేశ్వరరావుకు చెందిన గృహం గత కొద్ది రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధం అయ్యింది. విషయం తెలుసుకున్న గురవయ్య ఉత్తరచిరువోలులంక గ్రామంలోని మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో తన వంతుగా అగ్ని ప్రమాద బాధితుడు కోటేశ్వరరావుకు ఐదు వేల రూపాయల నగదును ఆదివారం అందజేశారు. కట్టుబట్టలతో మిగిలిన బాధితునికి తన వంతు సాయం అందించిన గురవయ్య మాస్టారుకి పలువురు కతజ్ఞతలు తెలియజేశారు.



సాయం అందజేస్తున్న దృశ్యం

ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌కు అభినందనలు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : జనసేన పార్టీ నాయకులు, వ్యవసాయ సాగునీటి సంఘాల ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా వేంకటేశ్వర యాదవ్ ఎన్నికైన సందర్భంగా ఆదివారం మచిలీపట్నం పార్లమెంట్ కార్యాలయంలో అభినందన సభ జరిగింది. వెంకటేశ్వరరావు యాదవ్ నీతి నిజాయితీకి మారుపేరుగా సర్పంచ్‌గా, ఎంపీటీసీగా ప్రజలకు సేవలు అందించారని వారి సేవలను గుర్తించి జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఉమ్మడి కష్ణాజిల్లా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ గా జనసేన పార్టీ నుండి అవకాశం కల్పించారని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ రైతుల సాగునీటి సమస్యల పరిష్కారానికి సాగునీటి సంఘాల నాయకులు, సభ్యుల సహకారంతో కృషి చేస్తానని అన్నారు..ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘ అధ్యక్షులు శాయన శివయ్య, దాసరి సాయిరాం, నల్లమోతు చంద్రమోహన్ చలమలశెట్టి వెంకటరమణ, కూటమి నాయకులు గరికపాటిశివ, మాదివాడ రాము,రొండి కష్ణ, మహమ్మద్ బాషా పాల్గొన్నారు.

సహాయం చేస్తున్న ఏజీఅండ్ స్జీ ఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్

సిసి కెమెరాల ఏర్పాటుకు సాయం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు పట్టణంలో సీసీ కెమేరాల ఏర్పాటుకు ఏజి అండ్ ఎస్‌జిఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ రూ. 20వేల ఆర్థిక సాయం ఆదివారం అందజేసింది. పట్టణంలో పలుచోట్ల సీసీ కెమేరాలు అవసరం కాగా వాటి ఏర్పాటుకు అసోసియేషన్లు, స్వచ్ఛంద సం స్థలు సహాయం అందించాలన్న పోలీసుల సూచన మేర వాకర్స్ అసోసియేషన్ అధ్య క్ష, కార్యదర్శులు సత్తార్,పూర్ణచంద్రరావు, గౌరవ అధ్యక్షుడు నూకల సాంబశివరావు, బా పిరాజు తదితరులు అసోసియేషన్ తరపున ముందుకు వచ్చి పట్టణ ఎస్సై విశ్వనాథ్ సూచించిన టెక్నిషియన్కు ఆర్థికం సాయం అందచేశారు. అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు బ్రహ్మేశ్వరరావు, భానుప్రకాశ్, కూనపరెడ్డి శ్రీనివాసరావు, వూరకిషోర్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

వికెఆర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-గన్నవరం : వికేఆర్ విద్యార్థుల(1994-97) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం గన్నవరం మండలం సావరగూడెంలోని మామిడ తోటలో జరిగింది. మొదటగా మృతిచెందిన గండికోట శంకర్, ఎన్ శ్రీనివాస్‌లకు నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పరిచయ కార్యక్రమం నిర్వమించారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్న పేద విద్యార్థులకు 40 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈకార్యక్రమంలో బండి నాగ సాంబరెడ్డి, కాటూరి వీరబాబు,పామర్తి నారాయణ, పటమట రంగారావు, కొండేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

శిబిరానికి వచ్చిన రోగులు

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడులో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం విజయవాడకు చెందిన ఆస్టర్ రమేష్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలోఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ హైస్కూల్ ఇంచార్జ్ హెడ్ మాస్టర్ జి గీత గాయత్రి, టీచర్స్ ఎం గీతామని,కే లలితారాణి శిబిరంలో పరీక్షా కేంద్రాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభించిన వైద్య శిబిరంలో వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చినవారికి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కంకిపాడు, పెనమలూరు, తోట్లవల్లూరు,ఉయ్యూరు తదితర గ్రామాల నుండి సుమారు 500 వరకు పేషెంట్లు వచ్చి ఉచితంగా వైద్య సేవలను వినియోగించుకున్నారని నిర్వాహకులు తెలియజేశారు.

నేడు కలెక్టరేట్ లో 'మీకోసం'

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాల యాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాల యాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించు కోవచ్చునన్నారు.

రామానుజన్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీనివాస రామానుజన్‌కు నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస్ రామానుజన్ జయంతి కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోస్టుమాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు, డాక్టర్ ఆర్ ఎన్ శంకరానంద్ పాల్గొని రామానుజన్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం గణిత శాస్త్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గణిత అధ్యాపకులు కే శ్రీనివాస్, పాఠకులు. గ్రంథాలయ అధికారి జె ప్రభుదాస్ సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్ వలంటీర్ల శ్రమదానం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం సావారగూడెం గ్రామంలో ఆదివారం రెడ్ వలంటీర్లు జగనన్న కాలనీలో శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాగ బ్రహ్మాచారి, నాగరాజు, ఆంజనేయులు, పాల్గొన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి వాలంటీర్లు కషి చేస్తున్నట్లు తెలిపారు.

ధర పతనం... మిర్చి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-నందిగామ: మిర్చి ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చి పంటకు మంచి ధర వస్తుందని ఆశతో శీతల గిడ్డంగులు లో నిల్వ చేసిన రైతులకు నిరాశే మిగిలింది. రెండు నెలల క్రితం వున్న ధర తగ్గుతూ వస్తుంది. కనీస ధరకు విక్రయించుకోలేక శీతల గిడ్డంగులలో నిల్వ వుంచు కుంటున్నారు. గిడ్డంగి అద్దెలు, అప్పులకు వడ్డీలు, అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ప్రస్తుతం ధర ఇలా వుంటే పంట వచ్చాక దర ఎలా ఉంటుందోనని కర్షకులు కలవర పడుతున్నారు. గత ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొని మిర్చి పండించారు. కోత, ఆరబోసే సమయంలో దర బాగున్నా కొందరు విక్రయించలేదు. ఇంక దర వస్తుందని ఆశతో శీతల గిడ్డంగులలో ఉంచారు. దర కోసం ఎదురు చూసిన ఫలితం లేకపోయింది. మళ్ళీ ఇతర పైర్లు సాగు చేశారు. పెట్టుబడులు కోసం విక్రయించాలనుకున్నా ధర లేక

అలాగే వుంచారు.ఫలితం గా అద్దె రెట్టింపు అయింది. ఎగుమతులు తగ్గిపోవడం, శీతల గిడ్డంగులలో పంట నిల్వలు ఉండటం, ఇతర రాష్ట్రాలలో కొత్త పంట మార్కెట్ రావడం తదితర కారణాల వల్ల దర పెరగ లేదని చెబుతున్నారు. రైతులు కూలీలకే క్వింటా 4 వేల నుండి 5 వేలు, ఎకరానికి లక్షన్నర రూపాయల వరకు పెట్టుబడులు పెట్టారు.

ధరలు ఇలా...

కల్లాల్లో ఉన్నప్పుడు మిర్చి తేజ రకం క్వింటా 21 వేలు, 344 రకం 16 వేలు నుండి 19 వేలు, సీడ్ రకాలు 13 వేల నుండి 17 వేలు వరకు దర వుండగా, విక్రయించకుండా గిడ్డంగులలో పంట నిల్వ ఉంచారు. ప్రస్తుతం నాణ్యత బట్టి తేజ రకం 13 వేల నుండి 15 వేలు, 344 రకం 9 వేల నుండి 12 వేలు, సీడ్ రకం 11 వేల లోపు దరలు పడిపోయాయి. నాణ్యత లేని మీడియం రకాలు క్వింటా పది వేలు లోపు పలుకుతుంది. శీతల గిడ్డంగులలో పంట నిల్వ చేసి నష్టపోయామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లావు రకం మిర్చి కల్లా లలో వున్నప్పుడు 14 వేలు అడిగారు. స్టోరేజ్ లో పెట్టాక 11 వేలకు మించి కొనటం లేదు. ఎసి అద్దెలు, కమిషన్, వడ్డీ కలిపి క్వింటా 3 వేల వరకు ఖర్చు కాగా 5 వేల వరకు నష్టం వచ్చిందని రైతులు వాపోతున్నారు.

జాబ్‌మేళాలో 630 మంది ఎంపిక

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని దానికి అనుగుణంగా సీఎం చంద్రబాబు వడివడిగా అడుగులు వేస్తున్నారని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలోని స్వర్ణ కన్వెన్షన్ హాల్‌లో టిడిపి, విహెచ్ఎస్ గ్రూప్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. తొలుత ఎన్టీఆర్ ప్రతిమకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ జాబ్‌మేళాలో దాదాపు 25 పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. సందర్భంగా శాసనసభ్యులు కృష్ణ ప్రసాదు మాట్లాడుతూ మైలవరం ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో శిక్షణనిచ్చి ఉద్యోగాలు కల్పిస్తున్న విహెచ్ఎస్ యాజమాన్యాన్ని అభినందించారు. త్వరలోనే మైలవరంలో కూడా మరో జాబ్ మేళా నిర్వహిస్తారని పేర్కొన్నారు. జాబ్‌మేళాలో మొత్తం 970 మంది పాల్గొనగా 630 మంది ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

మంత్రి సీతక్కను కలిసిన కిరణ్

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: తెలంగాణ మంత్రి సీతక్క ఆదివారం గుంటుపల్లిలో ఒక ప్రైవేట్ కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు రానున్నట్లు, కేంద్ర లో తప్పనిసరిగా ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని అన్నారు. ఏపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి నాయకత్వంలో పార్టీకి పూర్వ వైభవం రానుందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పోతురాజు ఏసుదాస్, చిలుకూరు సర్పంచ్ గొంది సురేష్, నాయకులు అక్కల ప్రసాద్, చెరుకు ఆనందరావు పాల్గొన్నారు.

31న మణిశర్మ మ్యూజిక్ లైవ్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: నగరంలో ప్రముఖ సినీ మ్యూజిక్ డైరెక్టర్ మణిశర్మ సందడి చేశారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ సహకారంతో విజయవాడలో ఈ నెల 31న భవానీపురం బబ్బురి గ్రౌండ్స్ లో లైవ్ ప్రోగ్రాం చేస్తున్నానని తెలిపారు. విజయవాడ వేదికగా తన లైవ్ ప్రోగ్రాంను నిర్వహించడం చాల సంతోషంగా ఉందన్నారు. సంగీత ప్రియులందరూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రముఖ సినీ మ్యూజిక్ డైరెక్టర్ మణిశర్మ ఆదివారం విజయవాడ నగరంలోని ఓ ప్రముఖ హోటల్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విజయవాడ వేదికగా డిసెంబర్ 31న తన లైవ్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.సంగీత దర్శకుడుగా 27 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాననీ,విదేశాలలో అనేక ప్రదర్శనలు ఇచ్చాననీ తెలిపారు. ఇప్పటి వరకు 230 చిత్రాలు చేశాననీ చెప్పారు. అనంతరం ప్రోగ్రామ్ డైరెక్టర్ శంకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ సహకారంతో బొబ్బూరి గ్రౌండ్స్‌లో మణిశర్మ లైవ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సినీ సంగీత ప్రియులను అలరించేందుకు ప్రముఖ హీరోయిన్ ముమైత్ ఖాన్, సిని నేపథ్య గాయని మధుప్రియ, ప్రముఖ యాంకర్ ఉదయభాను పాల్గొంటారని తెలిపారు.

భవానీలకు అన్నప్రసాదం వితరణ

భవానీలకు అన్నప్రసాదం వితరణ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-భవానీపురం: భవానీ దీక్షల విరమణకు వస్తున్న భవానీలకు, అమ్మవారి భక్తులకు తెలుగుదేశం 39, 44 డివిజన్ల క్లస్టర్ ఇంచార్జ్ బడుగు గణేష్ గౌడ్ ఆధ్వర్యంలో భవానీలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. భవానీ దీక్షల విరమణ రెండవ రోజు ఆదివారం విద్యాధరపురంలోని నాలుగు స్తంభాల సెంటర్ వద్ద నాగేంద్ర స్వామి బాల భక్త సమాజం నేతృత్వంలో అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్. బేగ్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెస్ బేగ్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా భవానీ దీక్షల విరమణ రోజుల్లో అమ్మవారి గిరిప్రదక్షిణ చేస్తున్న భవానీలకు, భక్తులకు నాగేంద్ర స్వామి బాల భక్త సమాజం వారు ఏటా క్రమం తప్పకుండా అన్నప్రసాద వితరణ చేయడం అభినందనీయమన్నారు. గిరి ప్రదక్షిణకు వచ్చే భవానీలకు ప్రతిరోజు రెండు వేల మందికి అన్నప్రసాద వితరణ చేయడం గొప్ప విషయమని అన్నారు. టిడిపి 44వ డివిజన్ అధ్యక్షులు బొడ్డపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఏటా ఐదు రోజులపాటు భవానీలకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న బడుగు గణేష్ గౌడ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బూర కనకారావు, ఎస్.కె అజీజ్, తమ్మిన శేఖర్, 44 డివిజన్ నాయకులు ఆత్మకూరి సూర్యనారాయణ, బడుగు సామ్రాజ్యం, పామర్తి భాస్కర్, బడుగు నాగరాజు, భీమ లింగేశ్వరరావు తదితరులు పాల్గొని భక్తులకు సేవలు అందించారు.

కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలో తెల్లవారుజామునే తీవ్ర చలిలో పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం కమిషనర్ ఇవి రమణబాబు ఆదివారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఆదివారం పట్టణం లోని శివాలయము దగ్గర, కూరగాయల మార్కెట్ నందు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. సదరు డ్రైవ్ నందు డ్రైనేజీ నుండి పూడిక తీయించి బ్లీచింగ్ చేయించి శానిటేషన్ చేయించారు. రామన్నపేట రోడ్డు నందు రోడ్డు మీద ఉన్న అనవసరంగా ఉన్న చెత్తను వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.

పేర్ని నానిపై చర్యలు తీసుకోవాలి : బుద్దా

ప్రజాశక్తి-వన్‌టౌన్: పేదల బియ్యాన్ని పందికొక్కులా తిన్న పేర్ని నానిపై ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న తెలిపారు. ఆదివారం మంగళగిరిలోని కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బుద్దా వెంకన్న మాట్లాడుతూ పేర్ని నాని చెప్పేది శ్రీరంగ నీతులు అన్నట్లుగా . దూరేది అదేదో అన్నట్లుగా నాని చేష్టలు ఉన్నాయని మండిపడ్డారు. ప్రతి చిన్న విషయానికి మీడియా ముందుకు వచ్చి కూటమి నేతలపై నోరు పారేసుకోవటం మానుకోవాలన్నారు. కులాల పేరుతో రెచ్చగొట్టే నాని. ఇప్పుడు 187 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని నాని అనే పందికొక్కు అమ్మేసుకుందన్నారు. పేర్ని నాని వంటి బియ్యం దొంగలను ప్రజలు క్షమించకూడదన్నారు. ప్రభుత్వాలు ఎంతో ఖర్చు చేసి పేదల కడుపు నింపడానికి చూస్తున్నాయని, ఏ తప్పు చేయకుండా కోటి 70 లక్షలు నాని కట్టాడు అంటే దొంగ అనుకోక తప్పదన్నారు. దొరికిపోయిన దొంగ కాబట్టే... డబ్బులు కట్టాడని విమర్శించారు. నీ కుటుంబాన్ని కూడా తీసుకుని పారిపోయే పరిస్థితికి పేర్ని నాని వచ్చాడన్నారు. పీయూష్ గోయల్ ఆరున్నర లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం దారి మళ్లిందని పార్లమెంట్‌లో చెప్పారని, కరోనా సమయంలో జగనే ఈ బియ్యాన్ని దారి మళ్లించి, ఆఫ్రికా వంటి దేశాలకు పంపారని తెలిపారు. ఇందుకోసం కృష్ణపట్నం, ఇతర రేవులను జగన్ ఆక్రమించి, పేర్ని నాని వంటి వారిని ఏజెంట్లుగా పెట్టుకున్నాడని విమర్శించారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కేతనకొండలోని గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వృద్ధులకు, వితంతువులకు ఆదివారం నూతన వస్త్రాలు అందించారు. గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ మోగులూరి ఎలీషా మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినం సందర్భంగా చేతనైన సహాయం చేయడం ద్వారా నిజమైన ఆనందం, సంతోషం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సుమలత, అబ్రహం, నాగరాజు, అనిల్, హరీష్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి-తిరువూరు: డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన తిరువూరులో ఆదివారం చోటుచే సుకుంది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం అక్కపాలెం గ్రామానికి చెందిన రేపాకుల విష్ణు (35) విజయవాడలో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఖమ్మం జిల్లా మద్రిగూడెంలో బంధువుల ఇంట్లో జరిగిన ఫంక్షన్‌కు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా తిరువూరు బైపాస్ రోడ్డు పశువుల సంత వద్ద డివైడరను ఢీ కొట్టా డు. తలకు బలమైన గాయమవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ బెతేల్ ప్రార్థనా మందిరం పాస్టర్ ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో ఆదివారం సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెతేల్ ప్రార్థన మందిరం నుండి గాంధీ సెంటర్ వరకు చిన్న పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఫ్రాన్సిస్ పాల్గొన్నారు. ఏపీ ప్రభుత్వ విప్, నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య కార్యాలయంలో ఆదివారం సెమిక్రిస్మస్

వేడుకలు నిర్వహించారు. సౌమ్య, ఏసిపి ఎబిజి తిలక్ క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. **జగ్గయ్యపేట:** యేసుక్రీస్తు బోధనల సారాంశాన్ని మానవాళి గ్రహించాలని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని బుదవాడ గ్రామంలో ప్రభు కుమార్, ప్రియాంక ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సెమీ క్రిస్మస్ కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బూడిద నరసింహారావు, పట్టణ అధ్యక్షులు వట్టెం మనోహర్, మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రోజుల తరబడి రోడ్లపైనే ధాన్యం

నాలుగు రోజుల నుంచి రోడ్డుపై ఉన్న వడ్లను చూపిస్తున్న రైతులు

- ఈక్రాప్ నమోదు చేయని సిబ్బంది
- వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆందోళన
- తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకుంటున్న రైతులు

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలంలోని వ్యవసాయ శాఖ, సివిల్ సప్లై అధికారుల పనితీరు ఎవరికీ చెప్తే మాకేంటి అన్నట్లుగా ఉంది. ఇటీవల సివిల్ సప్లై మంత్రి నాదెండ్ల మనోహర్, కష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటించి రైతులు ధాన్యం అమ్ముకోవడానికి పడుతున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం తరపున ధాన్యం కొనుగోలులో ఏ విధమైన సమస్యలు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వాస్తవంలో చూస్తే వారి ఆదేశాలు అమలు చేస్తున్న సందర్భాలు కనిపించడం లేదు అని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యాన్ని తెగనమ్ముకుంటున్న రైతులు

ఘంటసాల మండలంలోని అచ్చంపాలెం గ్రామపంచాయతీ పరిధిలో సుమారు వెయ్యి ఎకరాల భూమిలో వరి పంటను సాగు చేయగా వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి సగానికి పైగా భూమిని ఈ క్రాఫ్ లో నమోదు చేయలేదు. పంట ఈ క్రాఫ్ నమోదులో లేదని ఆ పంటను ప్రభుత్వం సేకరించడం లేదు. హార్వెస్టర్ ద్వారా నూర్పిడి చేసిన వరి ధాన్యాన్ని నిలువ చేయడానికి గాని, ఆరబెట్టుకోవడానికి గాని సౌకర్యం లేక, కొనే దిక్కు లేక రోడ్లపై పొలాల గట్లపై పది పదిహేను రోజులు నిల్వ ఉంచి వాతావరణంలో మార్పులకు భయపడి 1000 నుండి 1200 రూపాయలకు తెగునమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. జిల్లా కలెక్టర్ పర్యటనలో అచ్చంపాలెం సర్పంచ్ ఈ విషయాన్ని ఆయన దష్టికి తీసుకువెళ్లగా ధాన్యం సేకరణకు ఇబ్బంది రాకుండా చూస్తానని అధికారులకు సైతం ఆదేశం ఇవ్వడం జరిగినప్పటికీ తర్వాత కూడా అధికారుల పనితీరులో ఏ విధమైన మార్పు లేకపోగా అదే రీతిలో ధాన్యం తెగనమ్ముకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఈ క్రాఫ్ చేయని అధికారులపై చర్యలేవి

అచ్చంపాలెం పంచాయతీ పరిధిలో సుమారు వెయ్యి ఎకరాలు సాగు భూమి ఉండగా దానిలో దాదాపు సగం పైగా ఈ క్రాఫ్ లో నమోదు కాలేదు. ఈ విషయమై గ్రామ సర్పంచ్ పలువురు రైతులు కలెక్టర్ బాలాజీ దష్టికి తీసుకు వెళ్తూ గత నాలుగు సంవత్సరాలుగా తమ గ్రామంలో ఈ క్రాఫ్ట్ సరిగా జరగటం లేదని ఫిర్యాదు చేశారు. కలెక్టర్ కి ఫిర్యాదు చేసి పది రోజులు పైనే గడుస్తున్న ఈ క్రాఫ్ నమోదు చేయని అధికారులపై విచారణ చేసి చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు ఈక్రాప్ చేయలేదు

- రెడ్రోతు శ్రీనివాసరావు, అచ్చంపాలెం కౌలు రైతు

40 ఎకరాలు కౌలుకి తీసుకొని వరి సాగు చేశాను. పంట ప్రారంభం నుంచి ఈ క్రాఫ్ చేయవలసిందిగా కోరుతూ పలుమార్లు అధికారుల దగ్గరకు రైతు సేవ కేంద్రం దగ్గరకు తిరిగాను. అప్పుడు మాత్రం వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఈ క్రాఫ్ నమోదు చేయలేదు. కోతకు వచ్చిన తర్వాత ఈ క్రాప్‌లో నమోదు కాలేదని ధాన్యం కొనుగోలు చేయడం లేదు. మొత్తాన్ని గత 20 రోజుల నుంచి హార్వెస్టర్ ద్వారా నూర్పిడి చేసి ధాన్యాన్ని నిలువ చేయలేక 1000కి 1200కి వచ్చిన కాడికి అమ్మేశాను. ఇంకా పది ఎకరాల్లో దాన్యం గత నాలుగు రోజుల నుంచి రోడ్డుపైనే పోసి ఉంది. గ్రామంలో సగం మందికి పైగా ఇదే పరిస్థితి.

మిల్లుకు తోలేందుకు అనుమతివ్వడంలేదు

కళారి నాని, అచ్చంపాలెం రైతు

ఒకటిన్నర ఎకరాల్లో వరి సాగు చేసి 15 రోజులు క్రితం కోత కోసి ధాన్యం ఆరబెట్టడం చేశాను. తేమశాతం 20 చూపిస్తుంది, సైట్లో పేరు చూపించడం లేదని మిల్లుకు తోలడానికి అనుమతి ఇవ్వడం లేదు. బయట అమ్ముకోవాలి అంటే 1200 కన్నా ఎక్కువ రావడం లేదు.

మోపిదేవిలో ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి-మోపిదేవి : నిత్యం భక్తులతో రద్దీగా ఉండే మోపిదేవి రహదారులు ఎప్పుడు చూసినా కిక్కిరిసి కనిపిస్తున్నాయి. మంగళ, ఆదివారాలు అయితే చెప్పక్కర్లేదు. ట్రాఫిక్ కష్టాలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోపిదేవి దేవస్థానానికి వచ్చే భక్తులు తమ కారులను వాహనాలను రోడ్డుపైన వదిలేస్తున్నారు. దేవస్థానం పార్కింగ్ ఏరియా కూడా వాహనాలు చాలక రోడ్డుపై వదిలేస్తున్న పరిస్థితుల్లో అవనిగడ్డ రోడ్లో చాలా ఇరుకుగా ఉండి ట్రాఫిక్ సమస్య కలుగుతుంది. మంగళ ఆదివారాల్లో పెద్ద సంఖ్యలో వచ్చే వాహనాలు తాసిల్దార్ కార్యాలయం ముందు ఖాళీగా ఉన్న ప్రదేశంలో పార్కింగ్ చేసేలా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇలా చేయడం వలన రోడ్లపై వాహనాలు నిలిపే పరిస్థితి రాకుండా ట్రాఫిక్ కష్టాలు తొలగినట్లు అవుతుందని స్థానికులు కోరుతున్నారు.

గురు పురస్కార్ అవార్డు అందజేత

ప్రజాశక్తి-కోడూరు : రీఛార్జ్ బ్యాటరీ పితామహుడు డాక్టర్ చివుకుల హనుమంతరావు స్మారకార్థం సుగుణ సైన్సు అకాడమి గుంటూరు వారు గత 13 సంవత్సరాలుగా సైన్సు విభాగంలో ప్రతిష్టాత్మకంగా అందజేసే గురుపురస్కార్ అవార్డును ఆదివారం గుంటూరులోని హిందూ ఇంజనీరింగ్ కాలేజ్‌లో రవితేజ పాఠశాల ప్రిన్సిపాల్ కొరివి అనిల్ కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ కె. రామమోహనరావు పాల్గొన్నారు. రవితేజ పాఠశాల ప్రిన్సిపాల్‌ను సత్కారించి మెమెంటో అందజేయడంపై పాఠశాల డైరక్టర్ వల్లభనేని పరప్రసాద్ అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో గుర్తించడం అభినందనీయమని పాఠశాల కరస్పాండెంట్ కోట వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పాఠశాల స్థాయి నుంచే

క్రీడలపట్ల విద్యార్థులను ప్రోత్సహించాలి

- మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : పాఠశాల స్థాయి నుంచే క్రీడల పట్ల విద్యార్థులను ప్రోత్సహిస్తే గొప్పగా రాణించి అద్భుతాలను సష్టిస్తారని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 68వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్ జిల్లాల అండర్ 19 బాలురుల క్రికెట్ టోర్నమెంట్ ను ఆదివారం సాయంత్రం నగరంలోని ఆంధ్ర జాతీయ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరిగే ఈ టోర్నమెంట్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి దాదాపుగా 16 టీములు పాల్గొంటున్నాయని, ఆయా టీములు దాదాపుగా 26 మ్యాచులు ఆడతాయని తెలిపారు. ఈ టోర్నమెంట్ కు మచిలీపట్నం ప్రధాన వేదిక కావటం సంతోషంగా ఉందన్నారు. 2014-2019 టీడీపీ ప్రభుత్వ హయాంలో క్రీడలను ప్రోత్సహించేందుకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పెద్ద ఎత్తున పాఠశాల క్రీడా మైదానాలను అభివద్ధి చేసి విద్యార్థులకు క్రీడలకు సంబంధించిన కిట్లను అందించడం జరిగిందన్నారు. సీఎం కప్ తరహా ఆటల పోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పాటు ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో అన్ని ప్రాంతాలలో క్రీడామైదాలను అభివద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, గ్రీన్ స్టోన్ సిఎండి అప్పికట్ల అప్పారావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిణి ఝాన్సీ లక్ష్మి, కూటమి నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

కరాటేలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

ంప్రజాశక్తి-గన్నవరం : స్థానిక హనుమాన్‌జంక్షన్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో చదువుచున్న విద్యార్థులు కరాటే, కుమితే పోటీలలో వారి సామర్థ్యాన్ని చాటుకున్నారు. సీకో షాటకన్ అడ్వాన్స్ కరాటే ఇండియా వారు నిర్వహించిన ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్షిప్ 2024లో శ్రీ చైతన్య పాఠశాల విద్యా ర్థులు వివిధ బహుమతులు గెలుచుకున్నారు. చైత్ర(6వ తరగతి) కరాటే, కుమితేలో మొదటి బహుమతిని పొంది గోల్డ్ మెడల్ ను సాధించింది. టి ఎం. భార్గవి (ఏడవ తరగతి) కరాటేలో మొదటి బహుమతిని, కుమితే లో తతీయ బహుమతిని, ఎం రోషిణి (ఏడవ తరగతి) కరాటేలో మొదటి బహుమతి కుమితేలో ద్వితీయ బహుమతిని సాధించగా, ఎస్. కె. ఫిరోజ్ కరాటే, కుమితే లలో మొదటి బహుమతిని గెలుపొంది గోల్డ్ మెడల్ సాధించారు. యు. కీర్తిక(ఏడవ తరగతి) కరాటే మరియు కుమితే లలో మొదటి బహుమతిని, బి. మధుచంద్ర కరాటేలో మొదటి బహుమతిని, కుమితే లో ద్వితీయ బహుమతిని గెలుపొందారు. కరాటే మాస్టారు శ్రీనివాస్ ద్వారా శిక్షణ పొంది, విద్యార్థులు పలు బహుమతులు కైవసం చేసుకున్నారు. పాఠశాల ఏజిఎం. పార్థసారధి, రీజినల్ ఇంచార్జ్ ఉదయ భాస్కర్, కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపల్ వి. రాజేష్, డీన్ మౌలాలి తదితరులు విద్యార్థులను ప్రశంసించారు.

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం సందర్భంగా యాత్రికులు అత్యధికంగా అమ్మవారిని దర్శిం చుకున్నారు. సుమారు 15 వేల మంది యాత్రికులు అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, మొక్కుబడులు తీర్చుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు తెలిపారు. ఆలయము దగ్గర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వి వి సత్యనారాయణ సిబ్బంది తగు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఆర్థిక సాయం అందచేస్తున్న లయన్ క్లబ్ ప్రతినిధులు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఇటీవల మృతిచెందిన ఎలక్ట్రానిక్ మీడియా విలేఖరి కేసన శ్రీనివాసరావు కుటుంబానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ. 15వేల ఆర్థిక సాయం అందచేశారు. క్లబ్ అధ్యక్షుడు నేరెళ తేజ ఆధ్వర్యంలో క్లబ్ ప్రతినిధులు ఉయ్యూరులో శ్రీనివాసరావు కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించి ఆర్థిక సాయం అందచేశారు. క్లబ్ జిల్లా క్యాబినెట్ డిప్యూటీ సె క్రటరీ నూకల సాంబశివరావు, ట్రెజరర్ దినవపి¬ప్రసాద్, ప్రతినిధులు పొగిరిరాము, నల్లా శ్రీనివాస్, రామసత్యకిషోర్, పూర కిషోర్కుమార్, హాసన్ అహ్మద్, కృష్ణప్రసాద్ త దితరులు శ్రీనివాస్ కుటుంబసభ్యులను పరమర్శించి సంఘీభావం తెలిపారు.

వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : గద్దె

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: బాలల హక్కులు సంక్షేమం కోసం చట్టాలు ఉన్నట్టే వృద్ధుల సంక్షేమం కోసం కూడా చట్టాలు ఉన్నాయని తూర్పు నియోజక వర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పడి 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఆదివారం స్థానిక సిద్ధార్థ ఆడిటోరియంలో రజతోత్సవం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత స్వతంత్ర భారతి బృందం, విభిన్న ప్రతిభావంతులు దేశ ఖ్యాతిని కీర్తిస్తూ నృత్యాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన సావనీర్‌ను గద్దె విడుదల చేసి మాట్లాడారు. వృద్ధుల సంఘాలు రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో విస్తరణ జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.నారాయణ మూర్తి, ప్రధాన కార్యదర్శి కె.రామచంద్రరావు మాట్లాడుతూ 2007 కుటుంబ పోషణ చట్టం అమలు చేయాలని, సంఘం రాష్ట్ర కార్యక్రమాల కోసం రాజధాని కేంద్రంగా స్థలం కేటాయించాలని కోరారు. సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ అధ్యక్షులు ఎస్ భాస్కరరావు, ప్రముఖ వైద్యులు సమరం, సిఎల్ రాయుడు మాట్లాడుతూ వృద్ధుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పథకాలు భీమా వైద్య సౌకర్యాలు వివరించారు. సభా ప్రాంగణంలో వద్ధుల కోసం నేత్ర, దంత, వినికిడి వైద్య పరీక్షలు చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వివిధ రంగాల్లో ఉన్న 80 పైబడిన వృద్ధుల్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వేమూరు బాబురావు, కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు కామరాజు, స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, బి కీర్తి, టి.హనుమంతరావు పాల్గొన్నారు. ప్రజా గాయకులు ఆర్.పిచ్చయ్య, చంద్రా నాయక్ అభ్యుదయ గేయాలు ఆలపించారు.

సావనీర్‌ను విడుదల చేస్తున్న ఎంఎల్‌ఎ గద్దె రామమోహన్

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన

ప్రజాశక్తి-ఎ.కొండూరు: కేంద్ర హోం శాఖ మంత్రిగా ఉన్న అమిత్ షాను మంత్రి పదవి నుండి వెంటనే తొలగించాలని, ఆయన పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కోట కళ్యాణ్ డిమాండ్ చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పట్ల అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ దళిత గిరిజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం చీమలపాడు గ్రామంలో విజయవాడ జగదల్‌పూర్ జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు భూక్య గనియ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పి.ఆనందరావు, తిరువూరు టిడిపి ఎస్సీసెల్ మేకల రామారావు (జాన్), సోమ ఆనందరావు, ఎస్ చైతన్య, షేక్ మక్బుల్, పి దావీదు, పి.లెనిన్, ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

16వ డివిజన్‌లో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న నాయకులు

విద్యుత్ బిల్లులు దహనం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: పెంచిన కరెంట్ చార్జీలు వెంటనే తగ్గించాలని సిపిఎం తూర్పు నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ డిమాండ్ చేశారు. ట్రూ అప్ పేరుతో కరెంట్ చార్జీలు పెంపును వ్యతిరేకిస్తూ 16వ డివిజన్‌లో ఆదివారం విద్యుత్ బిల్లుల ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికలలో వాగ్దానం చేసి మాట తప్పిందన్నారు. లక్ష కోట్ల రూపాయలు భారం వేసే విధంగా అదాని సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని ముడుపులు తీసుకొని మోడీ ఒత్తిడి మేరకు జగన్ ప్రభుత్వం చేసిందన్నారు. ఆ ఒప్పందాన్ని రద్దు చేయకుండా కూటమి ప్రభుత్వం కొనసాగిస్తూ జగన్, అదానీ అవినీతిని కాపాడే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. కార్పొరేట్ల సంపద పెంచేందుకు పేదలపై భారాలు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు నగర కమిటీ సభ్యులు యన్.నాగేశ్వరరావు స్థానిక నాయకులు జికే. ప్రసాద్, గణేష్, నాగబాబు, మల్లేశ్వరరావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు. **తాడేపల్లి రూరల్:** తాము అధికారంలోకి వస్తే అదనపు విద్యుత్ బిల్లులు వేయబోమని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ప్రజలపై అదనపు విద్యుత్ భారాలు వేస్తుందని, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ అన్నారు. ఆదివారం ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి నటరాజ కళామందిరం వద్ద సిపిఎం శ్రేణులు విద్యుత్ బిల్లుల దహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఒక మాట, అధికారం చేపట్టాక మరొక మాటను చెబుతూ ప్రజలను మోసం చేస్తుందని ఆయన అన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం లో పెంచిన విద్యుత్ బిల్లులకు తెలుగుదేశం ప్రభుత్వం బాదుడే బాదుడు అంటూ విమర్శించి, నేడు ప్రజలపై ట్రూ అప్ చార్జీల పేరుతో అదనపు భారాలు వేయడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికే వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు పెట్టే ప్రక్రియను పునుకున్న కూటమి ప్రభుత్వం, ప్రజల నెత్తిన అదనపు భారం వేయడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. అనంతరం సిపిఎం శ్రేణులు విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాజా వెంకటేశ్వరరావు, అమ్మిశెట్టి రంగారావు, బడుగు వెంకటేశ్వరరావు, కొండపల్లి హరీష్, సుబ్బారావు, బాకీ చిన్నబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి పరిసరాలను శుభ్రంగా ఉంచాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: కన్వెయర్ బెల్ట్ ద్వారా భవానీ దుస్తులను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. భవాని దీక్షల విరమణ సందర్భంగా వినాయకుడికుని, సీతమ్మ వారి పాదాలు, కృష్ణవేణి ఘాట్, కేశఖండనశాల, కంట్రోల్ రూమ్, బబ్బురి గ్రౌండ్స్, పున్నమిఘాట్, కుమ్మరిపాలెం సెంటర్, గిరి ప్రదక్షిణ ప్రాంతాలను ఆదివారం పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో అమ్మవారి భక్తులకు త్రాగునీటి సరఫరా, స్నానాలకు నీటి సరఫరా, పారిశుధ్య, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా జరుగుతుందా లేదా అని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారుల వద్ద నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. భవానీ యాత్రికులు ఎక్కువ సంఖ్యలో వస్తుండటం గమనించి సిబ్బంది, అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. యాత్రికులకు ఎప్పుడూ త్రాగునీటి కొరత లేకుండా స్టాక్ ను చూసుకుంటూ ఉండాలని అన్నారు. భవాని విరమణ దీక్షలకు గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గిరిప్రదక్షిణ ఉన్న ప్రాంతం మొత్తం పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చిన్నచిన్న రాళ్లను సైతం తీసేసి పరిశుభ్రంగా ఉంచాలని, గిరిప్రదక్షిణ దారిలో భక్తులకు మరుగుదొడ్ల సౌకర్యాన్ని పెంచాలని మరి కొన్ని మొబైల్ టాయిలెట్లను అమరచి వలసిన అవసరం ఉందని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. దీక్షల్లో భవాని భక్తుల వదిలే దుస్తులను ఎప్పటికప్పుడు తీసేసి కన్వేయర్ బెల్ట్ ద్వారా నిర్వహణ చేయాలని, అధికారులందరూ కూడా అప్రమత్తంగా ఉంటూ సిబ్బందిని పర్యవేక్షిస్తూ ఉండాలని అన్నారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన సామాన్లు మరియు చెప్పులు భద్రపరిచే స్టాండ్లను ఉచితంగా అందుబాటులో ఉందని భక్తుల నుండి ఎటువంటి రుసుము వసూలు చేయట్లేదని భక్తులకు తెలిసే విధంగా మైక్ ద్వారా చెప్పుండాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజనీర్ పి సత్యనారాయణ పాల్గొన్నారు.

కృష్ణచైతన్యకు ఎంఎల్‌ఎ అభినందన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ నివాసంలో ఆదివారం వత్సవాయి మండలం మంగొల్లు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నంద్రు పుల్లయ్య కుమారుడు విజయ కృష్ణచైతన్య ప్రతిష్ఠాత్మకమైన కోల్‌కతా ఎయిమ్స్ (ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) నందు జనరల్ సర్జరీ విభాగంలో పీజీ మెడికల్ సీట్ (ఎం ఎస్) సాధించిన సందర్భంగా జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య విజయకృష్ణ చైతన్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం కష్ణయ్య, జె సుధానంద్, అల్లిక నరసింహారావు, జె ముక్తేశ్వరరావు, పి రవికుమార్, పెసరమెల్లి వెంకటేశ్వర్లు, ఎస్ డి రోషిద, సిహెచ్‌ఎస్‌ఎన్ మూర్తి, డి రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్షయపాత్రను సందర్శించిన ఎంఎల్‌ఎ రాము

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఆత్మకూరు లోని ఉన్న అక్షయపాత్ర ఫౌండేషన్ కేంద్రీకృత వంటశాల ను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సందర్శించారు. ఈ కిచెన్ ఆంధ్రప్రదేశ్ లోనే అతి పెద్ద కిచెన్, 3 ఎకరాలు భూమిలో ఈ వంటశాల ను ఏర్పాటు చేయగా 4 గంటల్లో 1లక్ష మందికి భోజనం తయారు చేయగల సామర్థ్యంతో ఏర్పాటు చేయటం జరిగిందని ఎమ్మెల్యేకు అక్షయపత్ర ప్రతినిధులు వివరించారు. ఇటీవలే వచ్చిన కృష్ణ నది వరదల సమయంలో ఈ వంటశాల నుంచే 16 లక్షల మందికి ఆహారం సరఫరా చేయటం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను చూసిన వంటశాలల్లో ఇది పరిశుభ్రంగా కనిపించిందని చెప్పారు. అక్షయపాత్ర ఫౌండేషన్ మరియు హరే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆఫ్ సెంట్రల్ రీజియన్ అధ్యక్షులు వంశీధర దాసు ఎమ్మెల్యే రాము ను మర్యాదపూర్వకంగా స్వాగతించారు. ఎంఎల్ఏ మన అందరి మిషన్ ఈ రాష్ట్రాన్ని ఆకలిబాధ లేని ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దతమే అని వ్యాఖ్యనిచ్చారు.

నిర్మలా పాఠశాల 42వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

విద్యార్థులు చిన్ననాటి విద్యతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండాలని మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ కె శకుంతల పేర్కొన్నారు. నిర్మల పాఠశాల 42వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పదవ తరగతి పరీక్షల ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను ఈ సందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శకుంతల మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో పాటు ఆటలు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల కూడా ప్రతిభ కలిగి ఉండాలని సూచించారు. అన్ని రంగాల్లో తర్ఫీదు ను అందిస్తున్న నిర్మల పాఠశాల సేవలను కొనియాడారు. రెవరెండ్ ఫాదర్ జోసెఫ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థికి వినయం విధేయతా చాలా అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి విజయకుమార్, సిస్టర్ య శౌరీ, కరస్పాండెంట్ సిస్టర్ జాన్ పాల్, పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ జ్ఞాన సౌందరి అతిథులను సన్మానించారు.

లయన్స్ విజయీభవ సేవా మహోత్సవం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: లయన్స్ క్లబ్ ఆఫ్ వి ఆర్ కె నగర మహిళ ఆధ్వర్యంలో విజయీభవ సేవా మహోత్సవ కార్యక్రమం కొండపల్లి రవీంద్ర భారతి స్కూల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హానరబుల్ చైర్ పర్సన్‌గా కార్యక్రమ రూపకర్త దేవినేని జోనికుమారి వ్యవహరించారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ 90 మంది మహిళలకు కుట్టు మిషన్లు, పది మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయన్స్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆంజనేయులు, ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లైన ఉపేంద్ర, శంకర్ గుప్తా, దేవినేని కిషోర్, సాయి వరప్రసాద్, నివత్తరావు, దుర్గా మల్లేశ్వరరావు, జిల్లా క్యాబినెట్ సభ్యులు పాల్గొన్నారు. ప్రోగ్రాం చైర్ పర్సన్ వెనిగళ్ల అమ్మాజీ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ వి ఆర్ కె నగర మహిళా ఆధ్వర్యంలో కొండపల్లి లోని వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన వారికి ఈ మిషన్ల పంపిణీ చేసినట్లు తెలియజేశారు. గవర్నర్ ఇంత చక్కటి ఉపయోగకరమైన కార్యక్రమాన్ని నిర్వహించిన మహిళా క్లబ్ సభ్యులను అభినందించారు. లబ్ధి పొందిన వారందరూ ఆర్థికంగా ఎదగడానికి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ రాజేశ్వరి, సెక్రటరీ సూర్యకుమారి, ట్రెజరర్ జయ గుణలతో పాటు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి తరానికి సింహాద్రి కృష్ణారావు ఆదర్శం

మాట్లాడుతున్న విరసం నాయకులు సిఎస్ఆర్ ప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : సింహాద్రి కృష్ణారావు ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించారని విరసం నాయకులు సిఎస్ఆర్ ప్రసాద్ కొనియాడారు. కృష్ణారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన సంస్మరణ సభ అవనిగడ్డ పంచాయతీ శివారు బందలాయి చెరువు గ్రామంలో నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది పరుచూరి రాఘవేంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ కృష్ణారావు భౌతికంగా మన మధ్య లేనప్పటికీ ఆయన వదిలిపోయిన జ్ఞాపకాలు అనేకమని వాటిని పంచుకోవడంలో ఉత్తేజంగాను ఆదర్శంగానూ ఉంటాయన్నారు. ఆయన ప్రజా ఉద్యమాల కోసం నిరంతరం పరితపించడంతోపాటు ప్రజలతో మమేకమై పనిచేశారన్నారు. సమాజ మార్పు లక్ష్యం కోసం పనిచేసిన కృష్ణారావు నేటి తరానికి ఆదర్శం అన్నారు. చంద్ర రాజేశ్వరరావు పుచ్చలపల్లి సుందరయ్య లాంటి తొలి తరం కమ్యూనిస్టుల దగ్గర్నుండి నేటి తరం విప్లవ నాయకుల వరకు ఆయన అందరి నాయకత్వాలలో నిబద్ధతగల కమ్యూనిస్టు కార్యకర్తగా పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో తొలుత కృష్ణారావు చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పిడిఎం నాయకులు అరవింద్, జర్నలిస్ట్ భరద్వాజ్, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు కృష్ణ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు మోషే, తమ్ము రత్తయ్య, ప్రజా కళామండలి నాయకులు జె కోటేశ్వరరావు, పరుచూరి జనార్దన్ తదితరులు పాల్గొన్నగా ప్రజా కళా మండలి కళాకారులు ఆలపించిన ప్రజా గేయాలు ఉత్తేజపరిచాయి.

సిమెంట్ రోడ్డు అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-గన్నవరం : గత ముప్పై ఏళ్లలో గన్నవరంలోని వీసీస్ సెంటర్ రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ రోడ్డుని బాగు చేయడానికి అలాగే అభివృద్ధి పరచడానికి ముందుకు అడుగులు వేశామని చెప్పారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వం నుంచి 18 లక్షల రూపాయలు వచ్చే విధంగా కృషి చేశారని అన్నారు. పాత ఎడ్ల లంకలో మాజీ సీఎం పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సింహాద్రి వికాస్ జడ్పిటిసి వైసిపి నాయకులు

కేక్ కట్ చేస్తున్న నాయకులు

జగన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని పాత ఎడ్ల లంక గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, తనయుడు సింహాద్రి వికాస్ పాల్గొని కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, అవనిగడ్డ మాజీ సర్పంచ్ నలకుర్తి పద్మీరాజ్, గ్రామ పార్టీ కన్వీనర్ మునిపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. అదేవిధంగా అవనిగడ్డలో వైసీపీ అభిమాని యువ నాయకులు బడే గౌతం ఆధ్వర్యంలో ఆయన స్వగృహం వద్ద నిర్వహించిన జగన్మోహన్ రెడ్డి జన్మదిన కార్యక్రమంలో గౌతమ్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.

'విద్యావికాస్'లో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక విద్యావికాస్ ఇంగ్లీషు మీడియం బ్లూబెల్స్, ప్రైమరీ, హైస్కూల్ శనివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును విద్యావికాస్ డైరెక్టర్స్ ముప్పాళ్ళ సుబ్బారావు, కొమ్మినేని సాంబశివరావులు కట్ చేసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారు వివిధ నాటికలు, నృత్యలు, పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే స్థానిక శ్రీకాళహస్తి కాలనీలోని గ్రేస్ ఇమ్మానియేల్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం పాస్టర్ వేసపోగు విజయబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి నాయకులు దేవరపల్లి వినయ్‌బాబు, మురళి, పిచ్చయ్యలు పాల్గొని క్రిస్మస్ కేకును క్యాండిల్స్ వెలిగించి దుస్తులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల నాటికలు, యాక్షన్ సాంగ్స్‌ను క్రీస్తు జననముపై ప్రదర్శించారు.

విద్యావికాస్‌లో వేడుకలు నిర్వహిస్తున్న చిన్నారులు

విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలి

ప్రజాశక్తి మంగళగిరి : రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి వి వి జవహర్లాల్ అన్నారు. ఆదివారం రాత్రి మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ కమిటీ సమావేశం ఎం బాలాజీ అధ్యక్షతన జరిగింది. జవహర్లాల్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఎన్నికలకు ముందు టిడిపి కూటమి పార్టీల నాయకులు అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచను అని చెప్పారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు నెలల్లోనే 18 వేల కోట్ల రూపాయలను సర్దుబాటు, ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపారు అని విమర్శించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంబేద్కర్ గురించి హేళన చేస్తూ మాట్లాడడం దారుణమని అన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

సంక్రాంతి పండుగ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించడానికి ఆయా శాఖలు పరిధిలో కృషి చేయాలని అన్నారు. ఇంకా ఈ సమావేశంలో సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్ ఎస్. చెంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎం చలపతిరావు, టి శ్రీరాములు, ఎస్ గణేష్, జే బ్రాహ్మణి, ఎం చంద్రరావు, ఆర్ వేణు, కే శ్రీనివాసరావు, పి రామచంద్రరావు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాల ప్రదాత వీరయ్య

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : భారతదేశానికి ఒక అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఎంతో సంవత్సరాలు కష్టపడి మంచి రాజ్యాంగాన్ని అందించారు. ఆ మహనీయుడినే స్ఫూర్తి ప్రదాతగా తీసుకుని ఆ ప్రపంచ మేధావి విగ్రహాలను అడిగిందే తడవుగా ఉచితంగా ఇస్తున్నారు గుడ్లవల్లేరు నెహ్రూనగర్‌కు చెందిన హిందూస్థాన్ పెట్రోలియం ఎం చెన్నై ప్రాంత మాజీ మేనేజరు డాక్టర్ తీట్ల వీరయ్య. దేశం నాకేమీ ఇచ్చిందని అనుకునే ఆ రోజుల్లో ఆ దేశానికి తాను ఏమి ఇచ్చానని భావించేవారు నేటి సమాజంలో అరుదుగా ఉన్నారు. కాని తన ఎదుగుదలకు తన సామర్థ్యమే గాక అంబేద్కర్ స్ఫూర్తి ప్రదాతే కారణభూతుడని తన మదిలో పదిల పరుచుకుని మననం చేసుకుంటూ నిత్యం కొలుస్తున్నారు డాక్టర్ వీరయ్య. అంతేగాక ఆ రాజ్యాంగ నిర్మాతను కొలిచే అభిమానులకు ఆయన ఉచితంగా అందజేసే అంబేద్కర్ విగ్రహాలు దోహదపడుతున్నాయి.

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వీరయ్య

వీరయ్య హిందూస్థాన్ పెట్రోలియం చెన్నై ప్రాంత మేనేజరుగా పని చేసి వాలంటరీ రిటైర్మెంట్ అయ్యారు. ఆయన సేవల్ని గుర్తించిన స సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది చిత్తర్వు నాగేశ్వరరావు, ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడు రెవ లింగం జాన్ బెన్నీ, ఎందరో దళిత నేతలు ఆయన్ను పలుసార్లు సన్మానించారు.

అంబేద్కర్‌పై అభిమానంతో విగ్రహాలు ఇస్తుంటా : డాక్టర్ తీట్ల వీరయ్య.

మాది చాలా పేద కుటుంబం. జీవితంలో ఎన్నో ఒడిదుడుగులు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చాను. మా గ్రామంలో చిన్నతనంలో ఎవరూ గౌరవించే పరిస్థితే ఉండేది కాదు. నేను చదువుకున్న చదువుతో పాటు అంబేద్కర్ ఇచ్చిన రిజర్వేషన్లు ఎంతో దోహదపడ్డాయి. మా కుటుంబం తరపున ఏటా ఒక అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన అభిమానులకు బహుమతిగా వివిధ గ్రామాల్లో ఇచ్చి ఆయన పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకుంటున్నా.

క్రిస్మస్ కానుకలు పంపిణీ

ప్రజాశక్తి మంగళగిరి : మంగళగిరి టౌన్ 21వ వార్డు పరిధిలోని ఆరు ప్రార్థన మందిరాలలో దైవ సేవకులకు క్రిస్మస్ సందర్భంగా మంత్రి నారా లోకేష్ పంపిన క్రిస్మస్ కానుకలను అందజేసిన టిడిపి నాయకులు ఆదివారం రాత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తోకల బాలాజీ,వంగర రమేష్, గంటా దుర్గా ప్రసాద్, గోలి మధు,గుంటిప్రతాప్,దైద యాకోబు కుక్కమళ్ళ క్రాంతి,మద్దిమడుగు పాండురంగ, వల్లపదాసు నారాయణ, అందె వీరాస్వామి తదితరులు ఉన్నారు.

నమో అదానీ-కరెంట్ కహానీ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు : విద్యుత్ రంగంలో అవినీతిపై నమో అదానీ- కరెంట్ కహానీ అనే పుస్తకాన్ని ఆదివారం సిఐటియు కార్యాలయంలో ఆవిష్కరి ంచారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు మాట్లాడుతూ అదానీ కంపెనీ ఏపి ప్రభుత్వంతో కుదుర్చుకున్న సౌర విద్యుత్ ఒప్పందంలో రూ.1750 కోట్ల లంచంగా ప్రభుత్వ పెద్దలకు ముట్టిందని అమెరికా కోర్టులో నమోదైన కేసు ద్వారా వెల్లడైందన్నారు. ఈ కుంభకోణంపై తక్షణమే విచారణ చేపట్టాలని, అదానితో చేసుకున్న అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. రాష్ట్రాలు, దేశాలను దాటి భారీస్థాయిలో జరిగిన ఈ వ్యవహారం కేవలం అవినీతికి సంబంధించిన అంశమే కాదని, దీని ఫలితంగా ప్రజలు అనేక భారాలు మోయాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా మనరాష్ట్రంలో ప్రజల మీద పడుతున్న విద్యుత్ బిల్లుల భారం వంటివి అదానీ అవినీతి ప్రతిఫలమే అన్నారు. గత ప్రభుత్వం, నేడు కూటమి ప్రభుత్వం కూడా అదానీ సేవలో మునిగితేలుతున్నాయని విమర్శించారు.అవినీతికి సంబంధించి హిండెన్ బర్గ్ నివేదిక ప్రజలపై పడే భారాలను వెల్లడించినా పాలకులు స్పందించకపోవడం సరికాదన్నారు. అదానీ కుంభకోణంపై దర్యాప్తు జరిపి విద్యుత్ సంస్థను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్.నాగబ్రహ్మచారి, దాసరి వెంకటేశ్వరరావు, సుబ్బారెడ్డి, ఆచారి, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించడం అభినందనీయం

- అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి

మాట్లాడుతున్న కోనేరు హంపి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : ఎంటిఎంసీ పరిధిలోని ప్రాతూరు ఎయి మి ఇంటర్నేషనల్ స్కూల్లో ఆదివారం రాత్రి స్కూల్ నాలుగవ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి ప్రముఖ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి, కేం బ్రిడ్జి అసోసియేట్స్ ఫాతిమా ముఖ్య అతిథులుగా హాజరు య్యారు. సందర్భంగా కోనేరు హంపి మాట్లాడుతూ అమరావతి రాజధాని ప్రాంతంలో అత్యాధునిక సాంకేతిక విలువలతో ఇంటర్నేషనల్ స్కూల్ ఉండడం, విద్యనందించడం ఆనందించదగ్గ విషయమని ఆయన అన్నారు. ప్రస్తుత తరుణంలో మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో అనేక మార్పులు వస్తున్నాయని అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుండి ఉన్నత విద్యను అభ్యసించేందుకు సాధన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో స్కూల్ చిన్నారులు చేసిన నత్యాలు, వివిధ రకాల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఎయిమి ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత దంటు బాలాజీ రెడ్డి, ఓంకార్, స్కూల్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలను రద్దు చేయకుంటే ఉద్యమం

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాథ్

ప్రజాశక్తి-విజయవాడ: విద్యుత్ భారాలను రద్దు చేయకుంటే ఉద్యమిస్తామని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ హెచ్చరించారు. విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కృష్ణలంక 21వ డివిజన్ కల్పన ప్రింట్స్ రోడ్డులో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈఆర్‌సి పేరుతో దాదాపు రూ.15.50 వేల కోట్లు విద్యుత్ భారాలను రాష్ట్ర ప్రజలపై మోపుతుందన్నారు. ఇప్పటికే రూ.6072 కోట్ల భారాన్ని మోపిన ప్రభుత్వం మరో రూ.9412 కోట్ల వచ్చే జనవరి నుండి వసూళ్లు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. కృష్ణలంకలో ఇంటింటికీ తిరిగి విద్యుత్ బిల్లులను పరిశీలించగా పెరిగిన బిల్లులతో ప్రతి ఒక్కరూ గగ్గోలు పెడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి బిల్‌లో వినియోగించిన విద్యుత్ యూనిట్‌లు గత నెల మీద వాడకం తగ్గినా బిల్లులో ఛార్జీలు మాత్రం 450 నుంచి 600 శాతం బిల్లులు భారం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ వాడకంలో ఆరు రకాల అదనపు భారాలను మోపి ప్రజల నుండి వసూళ్లు చేస్తున్నారన్నారు. తక్షణమే పెంచిన సర్దుబాటు, ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు నగర కార్యదర్శి పి.కృష్ణ, నగర కార్యదర్శివర్గ సభ్యులు కోరాడ రమణ, నాయకులు శివాజీ, తాడి రమణ, వేమన గోపి, పి.శ్రీరాములు, కామేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

21వ డివిజన్‌లో ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

విజయవాడలో యుఐ విజయయాత్ర

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: విజయవాడలో విలక్షణ నటుడు, దర్శకుడు ఉపేంద్ర సందడి చేశారు. యుఐ చిత్రం విజయోత్సవ యాత్రలో భాగంగా నోవా టెల్ హోటల్లో ఆ చిత్ర యూనిట్ ఆదివారం మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా చిత్ర కథా నాయకుడు ఉపేంద్ర మాట్లాడుతూ యుఐ సినిమా కథ 2040 లో ప్రపంచం ఎలా ఉంటుందో అనే అంశంపై ఆధారపడిందని చెప్పారు. ఈ సినిమాలో 'పగలు, రాత్రి' అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కిందన్నారు. తెలుగు ప్రేక్షకులు తమ చిత్రానికి బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. తెలుగులో మల్టీస్టారర్ చిత్రం చేయడానికి ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. అనంతరం చిత్ర నిర్మాత నవీన్ మనోహర్ మాట్లాడుతూ తమ చిత్రం విడుదలకు ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.

వెంకటేశ్వరరావుకు సన్మానం

ప్రజాశక్తి-విస్సన్నపేట: సేవే లక్ష్యంగా కులమత రాజకీయాలకు ప్రాంతాలకు అతీతంగా ఎన్నో సేవలందించిన టిడిపి సీనియర్ నాయకులు డాక్టర్ ఎన్‌టి వెంకటేశ్వరరావుకు వేదం ట్రస్ట్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ వెంకటేశ్వరావు అందించిన సేవలకు డాక్టరేట్ పొందారన్నారు. అనంతరం వెంకటేశ్వరావు దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేదం నిర్వాహకులు జాలిపత్తి కొండలరావు, మోరంపూడి శ్రీనివాసరావు, దమ్మలపాటి సాంబశివరావు, జే సాంబశివరావు, వి.శ్రీనివాసరావు వి.సత్యనారాయణ. మువ్వ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-మైలవరం: మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మైలవరం లోని బాలయోగి నగర్ మెట్రోపాలిటన్ మిషన్ చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వద్ధులకు, పేద మహిళలకు నూతన వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ గౌరవ అధ్యక్షురాలు శ్రీ పద్మ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని ఆ మార్గంలో ప్రతి ఒక్కరు ముందుకు వెళ్లాలని అన్నారు. పాస్టర్ ప్రకాష్ ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షురాల ఎకోయ సుధా, దారా మాధవి పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-విస్సన్నపేట: విస్సన్నపేట మండలం కొండపర్వ గ్రామం రామాలయం దగ్గర రోడ్డు గుంతలు పడిపోయి నీరు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి సంబంధిత సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త శివ సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు, విసన్నపేట పట్టణ అధ్యక్షులు జ్ఞానరత్నం, కరెడ్ల ధనమ్మ , ఆకుల శ్రీనివాసరావు, ఆడిమెల్లి కిషోర్ పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు పెన్షన్ రూ.10 వేలివ్వాలి

డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి కుటుంబరావు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: డప్పు కళాకారులకు పెరిగిన నిత్యావసర వస్తువులకు అనుగుణంగా పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం కుటుంబరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని డివిఆర్ నగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఆదివారం జగ్గయ్యపేట మండల డప్పు కళాకారుల సంఘం సమావేశం కెవిపిఎస్ నాయకులు జె వెంకటరావు అధ్యక్షతన జరిగింది. కుటుంబరావు మాట్లాడుతూ డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉన్న పెన్షన్లను వివిధ కారణాలతో తీసివేయరాదని, అర్హులైన పెన్షన్ దారులకు ఇండ్ల స్థలాలు, ప్రభుత్వం ఇల్లు కట్టించి ఇవ్వాలని, డప్పు కళాకారులకు గ్రూపుల వారీగా ప్రయాణ సౌకర్యం కోసం వాహనాన్ని ఇవ్వాలని, డప్పు కళాకారులకు రైలు, ఆర్టీసీ ప్రయాణంలో రాయితీ కల్పించాలని, సమాచార శాఖ ద్వారా జిల్లాల వారీగా పాత పద్ధతిలోని గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం రాజ్యసభలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సి హెచ్ శ్రీనివాస్, ఐద్వా నాయకులు సోమోజు నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోటా కృష్ణ, సిఐటియు నాయకులు దాసరి నాగేశ్వరరావు, డప్పు కళాకారుల సంఘం జగ్గయ్యపేట మండల కార్యదర్శి కూచిపూడి చిట్టిబాబు, నాయకులు ఆదిమళ్ల అబ్రహం, వై ప్రకాష్‌రావు, కె ప్రభాకర్, సుక్క వెంకటేశ్వర్లు, కే జయరాజు, చిన్న బ్రహ్మం, పి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన తెలుపుతున్న నాయకులు

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన గుగులోతు లలిత కుటుంబానికి రూ.61 వేల సీఎంఆర్‌ఎఫ్ సహాయాన్ని ఆదివారం స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ అందించారు. లలిత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. ఈ నేపథ్యంలో సిఎం సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరి గోపాలరావు, వెచ్చ శ్యామ్, పెంటేల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగామ: ఇది ప్రజల ప్రభుత్వమని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ఆదివారం రూ. 31.91 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం నందిగామలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పంపిణీ చేశారు. చందర్లపాడు, కంచికచర్ల, వీరులపాడు, నందిగామ మండలం, పట్టణంలోని 31 మంది లబ్దిదారులకు చెక్కులను అందజేశారు.

గణిత మేధావి రామానుజన్ జయంతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని జిఆర్‌సి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం గణిత మేధావి శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ గణితశాస్త్రంలో చేసిన అనితర సాధ్యంకాని అనేక సిద్ధాంతాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమానికి విశ్వభారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రముఖ గణిత అధ్యాపకులు కెఎన్ రమేష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని గణితశాస్త్రంలో ఇంటర్, డిగ్రీలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి నూటికి నూరు శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిఆర్‌సి ప్రిన్సిపాల్ జూటూరి వెంకటేశ్వర్లు (అబ్బులు), విశ్వభారతి డిగ్రీ కాలేజ్ డైరెక్టర్ జల్లా తిరుపతిరావు, అమ్మాని కళాశాల ప్రిన్సిపాల్ పి.సుధీర్‌కుమార్, గణిత అధ్యాపకులు అచ్యుతరావు, నరేందర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బాదంతో చక్కటి ఆరోగ్యం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ

అత్యంత ప్రజాదరణ పొందిన కాలిఫోర్నియా బాదం పప్పులు మాంసకృత్తులు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, మెగ్నీషియం, జింక్, ఫాస్పరస్‌తో సహా 15 ముఖ్యమైన పోషకాలు ఉంటాయని ప్రముఖ పోషకాహార నిపుణులు ఆలీ ఖాన్ అన్నారు. నగరంలోని ఓ హెూటల్ నందు ఆరోగ్యంపై అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాదం రుచిని పెంచడమే కాకుండా పండుగ సృష్టికి కొంత పోషక విలువలను అందిస్తాయి. అని తెలిపారు. బాదం చక్కటి ఆరోగ్యం అందిస్తుందని దీనిపై అవగాహన కోసం పండుగలు, శుభకార్యాల సందర్భంగా బాదం బహుమతిగా ఇవ్వాలని కోరారు. ప్రముఖ సైంటిఫిక్ జర్నల్స్‌లో ప్రచురించబడిన 200 కంటే ఎక్కువ అధ్యయనాల్లో, ప్రతిరోజూ కొన్ని కాలిఫోర్నియా బాదంపప్పులను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెరను నిర్వహించడంలో సహాయ పడుతుందని చూపబడింది. అని అన్నారు. ముఖ్యంగా పండుగ సీజన్‌లో బరువు నిర్వహణకు తోడ్పడతాయన్నారు.

వాగ్దేవి వార్షికోత్సవం

ప్రజాశక్తి జగ్గయ్యపేట: పట్టణంలోని వాగ్దేవి మహిళా కళాశాల 15వ వార్షికోత్సవ ఉత్సవాలు స్థానిక ఎస్వీఎస్ కళ్యాణ మండపంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ వాగ్దేవి కళాశాల గత 15 సంవత్సరాలుగా మహిళా విద్యార్థులకు అన్ని రకాలుగా ప్రభుత్వం అందించే స్కాలర్షిప్ తోనే ఉన్నత విద్యను అందిస్తూ రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి ర్యాంకులను సాధిస్తూ ప్రగతి పదంలో నిర్వహించబడుతుందని కళాశాల యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మంచిగా విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఇంటర్ ఎంపీసీ, బైపిసి, సీఈసీ గ్రూపుల్లో స్టేట్ ర్యాంకులను సాధించిన విద్యార్థినులకు నగదు బహుమానాలను అందజేశారు. వార్షికోత్సవం సందర్భంగా క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, కరస్పాండెంట్ సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.